


23 నుంచి బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

విజయనగరం టౌన్ : రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఈ నెల 23 నుంచి 25 వరకు స్థానిక డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ, ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ తీర్మానించింది. ఆదివారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి ఎన్.సురేష్ మాట్లాడుతూ 23న అండర్-19 బాలబాలికలు, మెన్ అండ్ ఉమెన్ సింగిల్స్, డబుల్స్ పోటీలు, 24న అండర్ -15 , 17 బాలబాలికల సింగిల్స్, డబుల్స్ పోటీలు, 25న అండర్ -11, 13 బాలబాలికల సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీలోగా ప్రవేశ రుసుం చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అందుకోసం పార్వతీపురం - జి.రాజేశ్వరరావు (9440505275), బొబ్బిలి-కె.అప్పన్నబాబు (798111170), సాలూరు - ఎమ్‌డి అబ్దుల్లా (9515729785), శృంగవరపుకోట - పి.శ్రీరాములు (7989199534), కొత్తవలస - వై.గణేష్ (9030185690), విజయనగరం - జి.శ్రీనివాసరావు (9133773485), చీపురుపల్లి - కె.వేణుగోపాలరావు (9866933193) నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమ్మెకు సమాయత్తం

విజయవంతం చేయాలని విస్తృతంగా ప్రచారం ● కేంద్ర కార్మిక, రైతు, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్యవేదిక ఆధ్వర్యాన నగరంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెల 9న చేపట్టే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక, రైతు, ప్రజా, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి జంక్షన్, ఎన్‌సిఎస్, రైల్వే స్టేషన్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ జెండా ఊపి ప్రారంభించారు.



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఐఎన్‌టియుసి నాయకులు ఎ.మధు సూదనరావుతో కలిసి ఆమె మాట్లాడారు. ఉత్పత్తి రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. కార్మికులను బానిసలుగా చేసే 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని, వీటిని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు యుఎస్ రవికుమార్, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సి హెచ్ వెంకటేష్, ఎల్ఐసి, మున్సిపల్ కార్మికులు, మెడికల్ రిప్స్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

9న టైర్ బంద్

ఈ నెల 9న టైర్ బంద్ చేపడుతున్నట్లు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో-కన్వీనర్ ఎ.జగన్మోహన రావు తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చేపట్టే టైర్ బంద్‌లో రవాణా రంగ యజమానులు, డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటుతోపాటు ప్రభుత్వమే యాప్‌ను నడపాలని డిమాండ్‌చేశారు. పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, వాహన కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ నెల 9న నగరంలోని కోట జంక్షన్ నుంచి జరిగే ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో లారీ, లగేజ్ గూడ్స్, ఆటో యూనియన్ అధ్యక్షులు టి.పైడిరాజు, టి.సత్తిబాబు, బి.లక్ష్మణరావు, నాయకులు కె.గంగరాజు, ఐ.ప్రసాద్, ఎ.అప్పలరాజు, బి.శ్రీను, డి.నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

● యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు
● సమ్మెకు యుటిఎఫ్ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని, బోధనేతర పనులు రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్తు మినిస్టీరియల్ హాల్లో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నాణ్యమైన విద్యపై కాకుండా, యోగాడే, మెగా పేరెంట్స్ సమావేశాలు విజయవంతాల కోసమే ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. బోధనేతర పనులకు ఉపాధ్యాయులను తిప్పడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదని అభిప్రాయ పడ్డారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు 1500 మందికి పొజిషన్ ఐడిలు లేక జీతాలకు నోచుకోని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు జెఆర్‌సి పట్నాయక్, పి.కస్తూరి, డి.రాము, ఎ.సత్యశ్రీనివాస్, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, పార్వతి, జిల్లా కోశాధికారి సిహెచ్.బాస్కరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనమివ్వాలి

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విజయనగరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మినీ వర్కర్లను ప్రధాన కార్యకర్తలుగా మారుస్తూ వెంటనే జిఒ ఇవ్వాలని, అంగన్వాడీలకు గ్రాట్యుటీ కోసం ఇచ్చిన జిఒ 8ని మార్పు చేయాలని కోరారు. బాల సంజీవని యాప్‌ని మార్చాలని, చేయాలని, అందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం జీతం పెంచుతుందని అంగన్వాడీలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రెండు యాప్‌లు అమలు చేయడం, నెట్ సౌకర్యం లేకపోవడంతో చాలా విధంగా నష్టం వాటిల్లుతోందన్నారు. లబ్ధిదారులు కూడా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఈ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, అధ్యక్షులు బి.పైడిరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, జిల్లా నాయకులు కృష్ణమ్మ, జ్యోతి, సుభాషిని, తులసి, రూపావతి, వరలక్ష్మి, సరళ, తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి నీటిపై అపోహలు నమ్మొద్దు

● జిందాల్ ఎంఎస్ఎంఇ పార్కులో ఎలాంటి పరిశ్రమలు వస్తాయో ఇంకా క్లారిటీ లేదు
● నీరు ఇక్కడి నుంచి అనేది ఇంకా నిర్ణయం జరగలేదు
● జిందాల్ నిర్వాసితులకు సమస్యలుంటే పరిష్కరిస్తాం
● విలేకర్ల సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాటిపూడి రిజర్వాయరు నీటి విషయంలో రైతులు గానీ, ప్రజలు గానీ ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఉద్దేశ పూర్వకంగా కొంతమంది రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జిందాల్ భూములను ఎంఎస్ఎంఇ పార్కు కోసం కేటాయించిన మాట వాస్తవమేనని, అక్కడ పరిశ్రమలు కూడా వస్తాయని, తద్వారా ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇంకా అక్కడ ఎలాంటి పరిశ్రమలు వస్తాయి? వాటికి ఎంతమేర నీటి అవసరాలు ఉంటాయనేది ఇంకా తేలాల్సి ఉందన్నారు. దీనిపై ఇంకా ప్రభుత్వంలో ఎలాంటి చర్చా జరగలేదని వివరించారు. 'మరోసారి చెప్తున్నా ఇప్పటి వరకు ఎంఎస్ఎంఇ పార్కుకు జిందాల్ భూముల కేటాయింపు మాత్రమే జరిగింది. కానీ, దానికి నీరు ఎక్కడి నుంచి ఇస్తామన్న దానిపై ప్రభుత్వంలో ఎలాంటి నిర్ణయం జరగలేదు' అంటూ నొక్కిచెప్పారు. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే, డిసిఎంఎస్ చైర్మన్, తన మాటలకు పొంతన లేదని చెప్పడం కూడా సరికాదన్నారు. వారు జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పారని, తాటిపూడి నీటిపై కొందరు సృష్టించిన అపోహలపై క్లారిటీ ఇచ్చానని వివరించారు.

జిల్లా అభివృద్ధి ఇష్టంలేనివారు ప్రజల్లో ఇలాంటి లేనిపోని అనుమానాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. జిందాల్ నిర్వాసితులకు ఇంకా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపుతుందని అన్నారు. గత ప్రభుత్వం గానీ, జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గానీ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులు కూడా చేపట్టామన్నారు. ఈ విషయంలో తాను బొత్సతో డిబేట్‌కు కూడా సిద్ధమేనని ప్రకటించారు. వైసిపి హయాంలో గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణం తప్ప మరేమీ చేయలేదని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.కోట్ల విలువైన రోడ్లు నిర్మించామన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సుపరిపాలన కార్యక్రమంలో ప్రజలు తమపై అభిమానం, ఆప్యాయతలు చూపుతున్నారని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న రోడ్లు నిర్మించాలని, సమస్యలను పరిష్కరించాలని తమను కోరుతున్నారని వివరించారు. గత ప్రభుత్వం 2019 -24 మధ్యలో వితంతువులుగా మారిన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని, వారంతా ప్రస్తుతం తమను పింఛన్లు అడుగుతున్నారని తెలిపారు. ఇటువంటి వారందరినీ ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు నాయకత్వంలో ఆలోచన జరుగుతోందని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ఉపాధి రహిత అభివృద్ధి

దేశ ప్రగతికి అవరోధం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు నేడు దేశంలో ఉపాధి రహిత అభివృద్ధికి కారణమవుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ తెలిపారు. ఈ విధానాలు కార్పొరేట్ల ఆస్తుల పెరుగుదలకు తప్ప కోట్లాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి తోడ్పడేవిగా లేవని అభిప్రాయపడ్డారు. ఆదివారం నగరంలోని ఎపిఎన్‌జిఒ హోంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక నగర మహాసభలో భాగంగా యూత్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'నిరుద్యోగ సమస్య యువత భవిష్యత్తు - శాస్త్రీయ పరిష్కారం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రభుత్వాలు సంపద సృష్టికి చోదక శక్తి అయిన మానవ శ్రమకు ప్రాధాన్యత ఇవ్వకుండా శుష్క వాగ్దానాలతో కాలక్షేపం చేస్తున్నాయని విమర్శించారు. మానవ శ్రమ వినియోగంలోకి తెచ్చి సంపద సృష్టికి దోహద పడే విధానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ప్రభుత్వాలకు ప్రజల అభివృద్ధిపై నిజమైన చిత్త శుద్ధి ఉంటే చదువుకున్న యువతకు ఉద్యోగం ఒక హక్కుగా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు దేశంలో, రాష్ట్రంలో యువకులు, విద్యార్థులు ఐక్య ఉద్యమాలతో పాలకులపై ఒత్తిడి పెంచితే తప్ప నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదని ఆయన ఉద్ఘాటించారు. జనవిజ్ఞాన వేదిక నగర అధ్యక్షులు డాక్టర్ ఎల్.చిన్నారి అధ్యక్షతన జరిగిన నగర మహాసభలో జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, పి.రమణ ప్రభాత్, సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ప్రసంగించారు. నగర ప్రధాన కార్యదర్శి కె.శశిధర్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం 17 మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జయపాల్‌రావు, అధ్యక్షులుగా ఎల్.చిన్నారి, ప్రధానకార్యదర్శిగా కె.శశిధర్, ఉపాధ్యక్షులుగా ఈపు విజయకుమార్, అప్పారావు, గణేష్, మజ్జి కాంతారావు, మీనాకుమారి, జమ్ము బంగారం, సుబ్రహ్మణ్యం, కార్యదర్శులుగా బాలరాజు, పి.వెంకట్రావు, ప్రకాశ్, పి.మురళీధర్, సతీష్ కుమార్, శ్రీనివాస్, కోశాధికారిగా కె.ఆదినారాయణ ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

'చరిత్ర చెప్పిన కథలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని ప్రయివేటు హోటల్లో ప్రముఖ రచయిత జి.వి.శ్రీనివాస్ రచించిన చరిత్ర చెప్పిన కథలు కథాసంపుటి పుస్తకాన్ని మయూరి హోటల్ అధినేత యార్లగడ్డ బాబురావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత రాణి శర్మ మాట్లాడుతూ ప్రతి భాషలో ఒక అందం, మృధుత్వం ఉంటుందన్నారు. ఈ పుస్తకం ద్వారా గ్రామీణ చరిత్రకు శ్రీనివాస్ ఒక లైఫ్ ఇచ్చారన్నారు. పాఠశాలలో ఇటువంటి చరిత్ర పుస్తకాలను ఉంచాలన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, విశ్వేశ్వరరావు, మంజరి, విశాఖ మాసపత్రిక ఎడిటర్ సన్యాసిరావు, వెటర్నరీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



చరిత్ర చెప్పిన కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాలల హక్కుల పరిరక్షణ, బాధ్యతలపై అవగాహన పెంచాలని జిల్లా పోలీస్ ముఖ్య సలహాదారు వై.పరశురామ్ అన్నారు. నగరంలోని కెఎల్‌పురంలోని ఎపిజిఇఎ జిల్లా కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక కార్యవర్గ సమావేశాన్ని కన్వీనర్ కంది వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ బాలబాలికలపై అకృత్యాలు, నిర్బంధాలు పెరుగుతున్నాయని, రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాస్తున్నారని తెలిపారు. వాటి పరిరక్షణకు సచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బాలబాలికలలో, తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు, ఐడెంటిటీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు లక్ష్మణరావు, కోకన్వీనర్లు పొడుగు రామకృష్ణ, కె.కిశోర్, ఎంపి నాయుడు, కె.రమేష్, ఎస్.సూర్యనారాయణ, బి.వి.లక్ష్మి, కార్యదర్శులు పి.వి.రమణ, ఎ రాజేశ్వరి, జిల్లా సలహాదారులు బల్ల శ్రీనివాసరావు, దేవిప్రసాద్ పాల్గొన్నారు.

11న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


ఈ నెల 11న జనాభా దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యంనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జిల్లా పరిషత్తు, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు సోమవారం మండల స్థాయిలో పోటీలు నిర్వహించాలని డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఈ నెల 9న జిల్లా స్థాయి పోటీలకు విజయనగరంలోని కంటోన్మెంట్‌లో ఉన్న నగర పాలక ఉన్నత పాఠశాలకు పంపించాలని తెలిపారు. పోగాకు, మత్తుపదార్థాల వినియోగం - నివారణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు, లింగ సమానత్వం, గౌరవ మర్యాదలు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు.

మడ్డువలసకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

ఒక గేటు ఎత్తివేత

ప్రజాశక్తి-వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస రిజర్వాయరుకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి క్రమేపీ ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లు కాగా, ఆదివారం సాయంత్రానికి 64.68 మీటర్లకు చేరింది. మరి కొంచెం నీటిమట్టం ప్రాజెక్టులో ఎక్కువైతే, ఎగువన ఉన్న నదీతీర గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. దీంతో ఒక ప్రధాన గేటు ఎత్తి 1084 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నట్లు ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ కుమార్ తెలిపారు.



రిజర్వాయరు గేటు ఎత్తి నాగావళి నదిలోకి విడిచిపెడుతున్న నీరు

నాగావళిలో భారీగా పెరిగిన నీటి ప్రవాహం

మండలంలోని నాగావళి నదిలో ఆదివారానికి నీటి ప్రవాహం భారీగా పెరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా తోటపల్లి ప్రాజెక్టు గేటు ఎత్తివేయడంతోపాటు వీరఘట్ట మండలం వైపుగా వస్తున్న ఒట్టిగెడ్డ నీరు వచ్చి నాగావళి నదిలో చేరుతోంది. దీంతో నాగావళి ఉధృతంగా ప్రవహిస్తోంది. గత కొన్నాళ్లుగా నదిలో నీరు తక్కువగా ఉండడంతో వివిధ గ్రామాల రేవుల వద్ద నుంచి ప్రజలు రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

హెల్మెట్‌తో ప్రాణాపాయం నుంచి రక్షణ

ప్రజాశక్తి కంటోన్మెంట్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి రక్షణ పొందాలని ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రహదారి ప్రమాదాల్లో కేవలం హెల్మెట్ ధరించని కారణంగానే మరణిస్తున్నారని తెలిపారు. వాహనాలు నడిపినప్పుడు ప్రతీ వాహనదారుడు విధిగా నాణ్యత కలిగిన హెల్మెట్ ధరిస్తే, ప్రమాదానికి గురైనప్పటికీ స్వల్ప గాయాలతో ప్రాణాలను రక్షించుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు తప్పనిసరిగా రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వస్తే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిర్లక్ష్యం కారణంగా వారి కుటుంబాలు వీధిన పడకూడదని చెప్పారు. అతివేగం ప్రమాదకరమని, వేగంకన్నా సురక్షిత ప్రయాణం ముఖ్యమని సూచించారు. ప్రతీ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించే విధంగా చేయాలనే సంకల్పంతో జిల్లా పోలీసుశాఖ పని చేస్తుందని వెల్లడించారు.

2499 అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం

● కేంద్రాలకు 9 గంటలకు సిబ్బంది హాజరుకావాలి
● వర్కర్లపై సిడిపిఒలు దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు
● 46,078 మందికి ఇకెవైసి పూర్తి
● 'ప్రజాశక్తి'తో ఐసిడిఎస్ పీడీ విమలారాణి ముఖాముఖి



ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో 2499 అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసిడిఎస్ పీడీ విమలారాణి తెలిపారు. జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్టుల ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్ల పట్ల సిడిపిఒలు దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 48,611 మందికి గాను 46,078 మందికి ఇకెవైసి పూర్తిచేశామని వివరించారు. దీనిద్వారా పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలను నివారించవచ్చని చెప్పారు. ఈవారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలో ఎన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టులు, కేంద్రాలు ఉన్నాయి.?


జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2206 అంగన్వాడీ కేంద్రాలు, 293 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. విజయనగరం, గంట్యాడ, గరివిడి, భోగాపురం, బాడంగి, చీపురుపల్లి , రాజాం, శృంగవరపుకోట, వియ్యంపేట, బొబ్బిలి, గజపతినగరంలో సిడిపిఒ ప్రాజెక్టులు ఉన్నాయి.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఎటువంటి పౌష్టికాహారం అందిస్తున్నారు.?

జిల్లాలో 2499 అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. నెలకు పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు నెలకు రాగి పిండి రెండు కిలోలు, అటుకులు కిలో, బెల్లం పావుకిలో, వేరుశనగ చెక్కిలు పావు కిలో, ఎండు ఖర్జూరం పావు కిలో అందిస్తున్నాం. గర్భిణులకు, బాలింతలకు ఐదు లీటర్ల పాలు, అర లీటర్ నూనె, కిలో కందిపప్పు, మూడు కిలోల బియ్యం.. అన్ని ప్యాకింగులతో అందిస్తున్నాం. ఏడో నెల నుంచి మూడేళ్ల వయస్సు గల పిల్లలకు బాలామృతం పౌడర్ రెండున్నర కిలోలు, రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లు ఇస్తున్నాం. మూడేళ్ల నుంచి ఆరేళ్ల ప్రీస్కూల్ పిల్లలకు భోజనాలు అందిస్తాం. వారానికో రంగు ఉన్న గుడ్లను ఐసిడిఎస్ స్టాంప్‌తో పంపిణీ చేస్తున్నాం.

అంగన్వాడీ కేంద్రాల సమయవేళలు ఏమిటి.?

ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ఉదయం తొమ్మిది గంటలకు తెరవాలి. సాయంత్రం నాలుగు గంటలకు విడిచిపెట్టాలి. ఉదయం 9 గంటల నుంచి అంగన్వాడీ కార్యకర్త, సహాయకులు ఇద్దరూ ఉంటారు. మధ్యాహ్నం మూడున్నర గంటల తర్వాత పిల్లలను వారి ఇంటికి అప్పగిస్తారు. నాలుగు గంటలకు అంగన్వాడీ కేంద్రాన్ని మూసేయాలి.



జిల్లాలో ఎంతమందికి పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ఇకెవైసి పూర్తిచేశారు.?

పోషణ్ ట్రాకర్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేసిన అందరికీ ఆధార్ కార్డు ఇకెవైసి ఫేస్ క్యాప్చర్ ద్వారా ఇకెవైసి చేయాలి. జిల్లాలో 48,611 మంది ఉండగా, ఇంతవరకు 46078 మంది లబ్ధిదారులను నమోదు చేశాం. ఫేస్ క్యాప్చర్ యాప్‌లో ఇబ్బందుల వల్ల అది పూర్తవడం లేదు. ఏడు నెలల నుంచి మూడేళ్ల మధ్య పిల్లలు 42,161 ఉన్నారు. ఈ నెలాఖరికి ఇకెవైసి ప్రక్రియ పూర్తిచేస్తాం.

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులు ఖాళీలు ఏమైనా ఉన్నాయా.?


జిల్లాలో 2206 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, 2184 కేంద్రాల్లో అంగన్వాడీ వర్కర్లు ఉన్నారు. 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హెల్పర్లు 2184కు గానూ 2130 మంది ఉన్నారు. 76 ఖాళీలు ఉన్నాయి. మినీ అంగన్వాడీ కేంద్రాలు 293 ఉండగా, 8 చోట్ల ఖాళీ ఉన్నాయి. జిల్లాలో వంద సూపర్వైజరు పోస్టులకు 34 ఖాళీగా ఉన్నాయి. యాక్టింగ్ సూపర్వైజర్లు 9 మంది ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఖాళీలను భర్తీ చేస్తాం. 11 సిడిపిఒ పోస్టులకు గానూ ఒకటి ఖాళీగా ఉంది.

సిడిపిఒలు కార్లను సక్రమంగా వినియోగించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.?

జిల్లాలో ఒక సిడిపిఒకు కారు ఆగింది. సిడిపిఒ కచ్చితంగా 20 కేంద్రాలను తనిఖీ చేయాలి. 2 వేల కిలోమీటర్లు వరకు ప్రయాణించాలి. ఆ మేరకు అధికారులకు ప్రభుత్వం రూ.35 వేలు చొప్పున చెల్లిస్తుంది. సొంత కార్లు వినియోగిస్తూ అద్దె కార్లకు బిల్లులు పెడితే విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటాం. అటువంటివి ఉంటే నా దృష్టికి తీసుకురావాలి.

అంగన్వాడీలను సిడిపిఒలు వేధిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.?

అంగన్వాడీ వర్కర్ల పట్ల సిడిపిఒలు దురుసుగా ప్రవర్తించకూడదు. కొందరు అంగన్వాడీ వర్కర్ల పట్ల వివక్ష చూపుతున్నారన్న విషయంపై నాకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదులూ రాలేదు. అంగన్వాడీ వర్కర్లు రెండు, మూడు నెలలు సెలవు పెట్టినా సిడిపిఒ హాజరు వేసి డబ్బులు తీసుకుంటున్నారన్న విషయం నా దృష్టికి రాలేదు. నా దృష్టి తీసుకొస్తే విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటాం.



అప్పలనాయుడుకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా 'బొంతు' విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పేరాపురానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, ఆధ్యాత్మిక చింతనతో జీవించిన ఆదర్శప్రాయ వ్యక్తిత్వం గల స్వర్గీయ బొంతు అప్పలనాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్మృతి సభలో పలువురు నేతలు బొంతు అప్పలనాయుడు సేవలను స్మరించుకుంటూ, ఆయనను అజాతశత్రువుగా, ప్రజల నేస్తంగా, గ్రామ అభివృద్ధికి కృషి చేసిన సేవాభావిగా ప్రశంసించారు. ఈ ప్రాంతం అభివృద్ధిలో ఆయన పాత్ర అమోఘమని కొనియాడారు. విగ్రహ ఆవిష్కరణకు తన కుమారుడు ముందుకు వచ్చి ఆదర్శంగా నిలిచినందుకు 'ఈ రోజుల్లో ఇలాంటి కుమారులు అరుదు, ఇది గర్వకారణం' అంటూ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శిలు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మినాయుడు, మహంతి శంకరరావు, విశాఖ నార్త్ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్, నెల్లిమర్ల టిడిపి మండల అధ్యక్షుడు కడగల ఆనందకుమార్, పూసపాటిరేగ వైసిపి మండల అధ్యక్షులు పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రామ పర్యటన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఎరుసుపేట, మద్దిపేట, గుడివాడలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం పర్యటించారు. తాగునీటి, రెవెన్యూ, పెన్షన్ సమస్యలను ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా తాగునీటి ఎద్దడి, జల జీవన్ మిషన్ పనుల నాణ్యత లోపాలు, రెవెన్యూ సమస్యలు, పింఛన్ల మంజూరులో జాప్యం, 'తల్లికి వందనం' పథకం మంజూరు వంటి సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులతో త్వరలోనే సమావేశమై వీటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడుపువలస సర్పంచ్ మట్ట అయ్యప్ప రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు వందనాల రవణ, గుడివాడ ఇన్‌చార్జ్ డల్యా రెడ్డి, రాము, శ్రీను, ప్రసాద్, త్రినాథ్, సత్యనారాయణ మాస్టర్, త్రినాథ్ రెడ్డి, దల్లి శ్రీను, సీతాం నాయుడు, మురళి, శంకర్, సురేష్, కొయ్య రాంబాబు తదితరులు పాల్గొన్నారు

సంఘ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

విశ్వబ్రాహ్మణ సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లంపల్లి ఆచారి అన్నారు. ఆదివారం చీపురుపల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఆ సంఘ ఎన్నికల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కులంలో పేదవారెవరైతే ఉన్నారో వారికి సాయాన్నిందించే బాధ్యత ఆర్థికంగా స్థిరపడినవారు తీసుకోవాలని కోరారు. కార్పోరేట్ సంస్థలు వచ్చిన తరువాత విశ్వబ్రాహ్మణుల వృత్తి కనుమరుగై జీవనోపాధిని కోల్పోతున్నారని ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణుల ఆర్థిక పరిస్థితులు మెరుగు పరిచేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన సంఘ కమిటీతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడిగా మారోజు చక్రధర్, ఉపాధ్యక్షుడిగా సర్వసిద్ధి భాస్కరరావు, కార్యదర్శిగా పట్నాల ఈశ్వరరావు, సహ కార్యదర్శిగా బంగారు గోపి, కోశాధికారిగా అనుపోజు రాము, గౌర సలహాదారునిగా బోనుమద్ది ఆచారితో పాటు మరో 9 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీరు విమర్శలు చేస్తే.. మేము అభివృద్ధి చేస్తాం

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

చీపురుపల్లి: వైసిపి నాయకులు పనిలేక విమర్శలు చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తే.. తాము అభివృద్ధి చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తామని టిడిపి జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వైసిపి నాయకుడు బొత్స సత్యన్నారాయణ మాట్లాడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ప్రజలను మభ్యపెట్టే మాటలు బొత్స చెబుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఏవైతే హామీలు ఇచ్చామో వాటిని అమలు చేసిందీ లేనిదీ ప్రజల్లోకి వెళితే తెలుస్తుందని అన్నారు. గ్రామాలకు వెళ్లి ప్రజలను అడిగితే నిజా నిజాలేమిటో చెబుతారని హితవు పలికారు. ఎన్నికల ముందు ఇచ్చిన తల్లికి వందనం, దీపం పథకం-2, నాలుగువేల ఫింఛన్లు ఇస్తున్నామో లేదో ప్రజలనే అడిగి తెలుసుకోవాలని బొత్స సత్యన్నారాయణకు సూచించారు. పరదాలు కట్టుకుని తిరిగే మీ నాయకుడిలా కాకుండా ఏడాదిలోనే ఇచ్చిన హామీలు అమలు చేసి సుపరిపాలనలో ముందడుగు ద్వారా ప్రజల్లోకి ధైర్యంగా వెళుతున్నామన్నారు. గత ఐదేళ్లలో వైసిపి పాలనంతా విధ్వంశం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి వాటితోనే సరిపోయిందని విమర్శించారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

కొత్తవలస: మండల కేంద్రంలోని ఉమాదేవి కాలనీ దగ్గర చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం ఆలస్యంగా వెలుగు చూసింది. కొత్తవలస ప్రాంతానికి చెందిన గంగవరపు గౌరీ సత్య వరప్రసాద్ (38) ఉమాదేవి కాలనీ దగ్గర మామిడి తోటలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి సిఐ షణ్ముఖరావు తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పని గంటల పెంపు.. శ్రమ దోపిడీనే

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేంద్ర ప్రభుత్వం కార్మికుల పనిగంటలను పెంచడం కార్మికుల శ్రమను యజమానులకు దోచి పెట్టేందుకేనని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. ఆదివారం ఆమె సిఐటియు నాయకులు టివి రమణ, కాకి సురేష్‌లతో కలిసి పట్టణంలోని శ్రీనివాస కాలనీలో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన కార్మికులకు నష్టదాయికమైన లేబర్ కోడ్లను రద్దు చేయడాన్ని నిరసిస్తూ అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరుగుతుందని ఈ సమ్మెకు రైతు సంఘాలు, వ్యవసాయ సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేసి గ్రామీణ బందు నిర్వహిస్తాయని చెప్పారు. నరేంద్ర మోడీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని గతంలో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా యజమానులకు అనుకూలంగా మార్చేసారని గుర్తు చేశారు. ఈ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి కనీసం రూ.9వేలు పెన్షన్, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులందరికీ సమగ్ర చట్టం చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీకి బడ్జెట్ పెంచి 200 రోజులు పని దినాలు కల్పించాలని, స్కీం వర్కర్లను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ లేబర్ కోడ్లను తీసుకురాకముందే రాష్ట్రంలో 12 దినాలను అమలు చేసే విధంగా క్యాబినెట్ తీర్మానం చేసిందని ఇప్పటికే మహిళల పట్ల లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు నైట్ షిఫ్ట్‌లో డ్యూటీలు చేయాలని క్యాబినెట్ తీర్మానించిందని దీనిని కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు చెలికాని ముత్యాలుపాల్గొన్నారు.

రాజాం: ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు కోరారు. మండలంలోని దుప్పలపూడి సత్యనారాయణ కాల నీలో నాగవంశం శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం కార్మికు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెలో రాజాంలో ఉన్న మున్సిపల్, అంగ న్వాడి, ఆశ, ఆర్పీలు, మధ్యాహ్నం భోజనం, విఒఎ, గ్రీన్ అంబా సిడర్లు, విఆర్ఎలు, కళాసీలు భవన నిర్మాణ కార్మికులు, షాపుల్లో పనిచేసిన వర్కర్స్ ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొవా లన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి జరిగే ప్రదర్శనలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపడతామన్నారు. ఈ సమావేశంలో పి. రాజేష్, శ్యామల, రాజాం నియోజకవర్గం సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐఎఫ్‌టియు నాయకులు రెడ్డి నారాయణరావు కోరారు. స్థానిక ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన తోపాటు శ్రీ విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎన్.అప్పలరాజు రెడ్డి మాట్లాడారు. ఈ నెల 9న ప్రకాశం పార్క్ నుండి గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి కోవెల మీదుగా ఎస్‌బిఐ. మెయిన్ బ్రాంచి వరకు ప్రదర్శన చేపడుతున్నట్లు తెలి పారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బాలి సన్యాసిరావు, చెన్నా ధర్మ, కంది రాము, శ్రీధర్, నారాయణరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఈ నెల 9న జరిగే కార్మిక సమ్మెకు మద్దతుగా నిరసన ప్రదర్శనలు చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.లెనిన్, మద్దిల ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం వారు మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెకు మద్దతుగా వ్యవసాయ రంగ రక్షణకు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలో నిరసన ప్రదర్శనకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక రక్షణకు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి పారిశ్రామిక వేత్తలకు మేలు చేసే 4లేబర్ కోడ్లు తీసుకువచ్చి 8గంటల పనిని 12గంటలకు పెంచి కార్మిక వర్గంపై పని భారాన్ని పెంచారాని తెలిపారు. వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు చేపడుతున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొవాలని కోరారు.

మొక్కలు నాటుతూ నిరసన

- ఉణుకూరు రోడ్డు సమస్య పరిష్కరించకుంటే రాస్తారోకో
- కలెక్టర్ స్పందించకుంటే

14న రహదారి నిర్బంధం: సిపిఎం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉణుకూరు రోడ్డులో గత 8 సంవత్సరాల నుండి గుంతలతో పాదాచారులు, ప్రయాణికులు, గ్రామ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే తారు రోడ్డు మంజూరు చేయాలని, రోడ్డు సమస్య పరిష్కరించుకుంటే ఈనెల 14న గ్రామ ప్రజలతో నిర్బంధం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకర్రావు, మండల శాఖ కార్యదర్శి మడపాన త్రినాథ్ కోరారు. ఈ మేరకు ఆదివారం రాజాం -వంగర ప్రధాన రహదారి ఉణుకూరులో కిలోమీటర్ మేర పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడం, ఆ గుంతలు చెరువులను తలపించడంతో మొక్కలు నాటుతూ ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం ఈ రోడ్డును మరమ్మతులు చేయకుండా వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం కూడా రోడ్డు వేయకపోవడం దారుణమని విమర్శించారు. వంగర మండలం రూట్‌లో ఉణుకూరు మీదుగా సుమారు 80 గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు రోజువారి రాజాం పట్టణానికి విద్య, వైద్యం, విద్యార్థులు, వ్యాపారులు ఇతర పనులు కోసం ప్రయాణం చేయవలసి ఉందని గుంతలమయమైన రోడ్లుతో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు, బస్సులు ఉణుకూరు రోడ్డు మీద ప్రయాణం ఒక నరకానికి నా కళ్ళుగా మారాయని అన్నారు. అన్ని రకాల వాహనాలు ఈ ఊరు రోడ్డు మీద ప్రయాణం చేస్తుంటే అదుపుతప్పి ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారని వాపోయారు. కొన్ని సందర్భాల్లో వాహనాలు మరమ్మత్తులు జరిగి గుంతల్లోనే ఉండిపోయే పరిస్థితి ఉందని చెప్పారు. తక్షణమే ఉనుకూరు గ్రామంలో సుమారు 1000 మీటర్ల రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారులు చొరవ తీసుకొని ఈ రోడ్డు వేయ్యాలని డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతులు చేపట్టకుంటే జూలై 13 నాటికి ఈ రోడ్డు ప్రతిపాదన చేయాలని, లేనిపక్షంలో జూలై 14న గ్రామ ప్రజలందరూ కలిసి ఈ రోడ్‌లో పెద్ద ఎత్తున రాస్తారోకో చేసి ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే దిగి వచ్చేవరకు పోరాడతామని వారంతా ఖరాకండిగా సంఘటితంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు వియ్యపు లక్ష్మిం నాయుడు, జి. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



గుంతల్లో మొక్కలను నాటుతున్న నిరసన కారులు

రోడ్డుకు రూ.4.5కోట్లు మంజూరు

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గంలో పాడైపోయిన రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే బేబినాయన కోరడంతో స్పందించిన ప్రభుత్వం గొల్లపల్లి నుంచి అలజంగి మీదుగా కారాడ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. మిగిలిన రోడ్డుకు రూ.8.50కోట్లతో ప్రతిపాదనలు చేశారు. టెండర్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బి ఎఇ రాజు చెప్పారు.

నేడు బడి బస్సు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట, వేపాడ

ఎస్‌కోట ఆర్‌టిసి డిపో నుంచి వేపాడ మండలంలోని సోంపురం, జాకేరు, చామలాపల్లి మీదుగా బక్కునాయుడుపేట వద్ద గల ఎపి ఆదర్శ పాఠశాలకు బడి బస్సు ప్రారంభించనున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపురం, జాకేరు, కరకవలస మారిక, చామలాపల్లి, పోతుబందిపాలెం, దబ్బిరాజుపేట, వేపాడ మీదుగా బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు ఎస్‌కోట ఆర్‌టిసి డిపో నుండి బడి బస్సు నడపాలని ఏళ్ల తరబడి వినతలు అందుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రూటు పరిశీలన చేసి సోమవారం నూతన బడి బస్సును ప్రారంభిస్తున్నామని ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొవాలని ఆయన కోరారు

కౌన్సిలర్ చొరవతో బురద తొలగింపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో 7వ, వార్డు పరిధిలో నెల్లిమర్ల నుండి రణస్థలం వెళ్లే మార్గం మధ్యలోని రైల్వే బ్రిడ్జి దగ్గర గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నీరు, డ్రైనేజీ నుంచి వచ్చిన బురద నీరు చేరడంతో వాహనదార్లు, ప్రయాణికులు ఇబ్బందులు పడడంతో ఆ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తన సొంత ఖర్చులతో జెసిబిని తెప్పించి ఆదివారం చేరిన బురద నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై గతంలో అధికార్లకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. కొన్ని రోజుల క్రితం రోడ్డు వేశామని వర్షానికి వచ్చే నీరు అక్కడ నిలిచిపోతుండటంతో వర్షపు నీరు మళ్లించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని అన్నారు. ఈ సమస్యపై నగర పంచాయతీ కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని కొన్ని రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ప్రసాద్ తెలిపారు.

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలో తుమికాపల్లి గ్రామం వద్ద ఉన్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం 12 రకాల నిత్యవసరాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ట్రస్ట్ మెంబర్ తులసీరాం భావన దంపతుల తనయుడు వేయాన్ష్ పుట్టినరోజు సందర్భంగా నిత్యవసరాలు పంపిణీ చేశామన్నారు.ఉపాధ్యాయులు కామేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, అమ్మ క్యాటరింగ్ సందీప్, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, ట్రస్ట్ సభ్యుల ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం కోరుబిల్లి గణపతి చేతుల మీదుగా నిత్యవసరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్, నగేష్, ప్రకాష్, త్రివేణు పాల్గొన్నారు.

నేడు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - వేపాడ

ఈ నెల 7న నెల్లిమర్ల గురుకుల వసతి గృహంలో ఎస్‌టి, ఎస్‌సి కులాలకు చెందిన విద్యార్థులకు ఐదు, ఇంటర్‌లో ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహం ప్రిన్సిపల్ జైశ్రీ తెలిపారు. ఉండి గతంలో పరీక్ష రాసి ఉన్న వారికి మిగులు సీట్లు భర్తీ చేయడానికి ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని ఆమె కోరారు.

రేపు వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి -వేపాడ

ఈ నెల 8న ఎస్.కోట ఏకమ్మ పేరంటాలు కల్యాణ మండపంలో వైసిపి విస్తృత స్థాయి సమావేశం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎం. జగ్గుబాబు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతారని మండలంలోని జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, పార్టీ నాయకులు, హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల, కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలను సరిచేసే పనిలో భాగంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కొండవెలగాడ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో పారసాం, తల్లాపూడిపేట రూరల్ ఫీడర్, తాళ్లపూడిపేట, పెదబూరాడ పేట, చిన్నబూరాడ పేట, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్‌పురం, తుమ్మలపేట, పారసాం, గెడ్డపేట, గుర్ల సెక్షన్ నడుపూరు, భూపాలాపురం, ఆనందపురం గ్రామాలకు, నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధి 11 కెవి గుర్ల రూరల్ ఫీడర్‌లో గరికిపేట, కొండగుంపాం, మొయిద నారాయణపట్నం గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని బహుళార్ధ పశు వైద్యశాలలో జూనోటిక్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంయుక్త సంచాలకులు డాక్టర్ వైవి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 70 శాతంకి పైగా వ్యాధులు జంతువులు నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమిస్తు న్నాయన్నారు. వీటి పట్ల జంతు ప్రేమికులు, యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 584 పెంపుడు కుక్కలు పిల్లలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకా వేశారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ గంటి మహాలక్ష్మి , సహాయ సంచాలకులు డాక్టర్ సన్యాసినాయుడు, డాక్టర్లు కె.వి. రమణ,కిషోర్, ధర్మారావు, మోహన్, హిమజ, వెంకటేశ్ , ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వెంకట్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ: స్థానిక పశువైద్య ఆసుపత్రి పరిధిలోని ఆదివారం డాక్టర్ రెడ్డి కృష్ణ 42 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు పలు రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులపై వివరించారు. పెంపుడు కుక్కల పెంపకంలో యజమానులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సంవత్సరానికి ఒక్కసారి ఈ వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. ఆడపెయ్యిలు పుట్టడం కోసం 150 రూపాయలకు ఇంజక్షన్‌ను చేస్తున్నామని గతంలో ఇంజక్షన్ చేయడానికి రూ.500 తీసుకునేవారని ఇప్పుడు ప్రభుత్వం తగ్గించిందని చెప్పారు.

వేపాడ: మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయం వద్ద ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పెంపుడు కుక్కలు పట్ల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పథక సంచాలకులు, రైతులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని మరుపల్లి, తుమ్మకాపల్లి పశు వైద్యాధికారులు డాక్టర్ వి.సుధీర్, బి.అవినాష్ అన్నారు. ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా మండలంలో ఉన్న పశు వైద్యశాలల్లో ఉచిత టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూనోసిస్ డే సందర్భంగా 83 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా వేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శం.. ఏకలవ్యుడు



ఏకలవ్య విగ్రహానికి పూలమాలవేస్తున్న గౌరు

ప్రజాశక్తి- బాడంగి

ప్రతి ఒక్కరూ ఏకలవ్యుడును ఆదర్శంగా తీసుకోవాలని టిడిపి ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ, గజరాయివలస ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు. ఆదివారం లక్ష్మీపురం పంచాయతీలోని ఎరుకుల పాకలు గ్రామంలో ఏకలవ్యుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్యుడు త్యాగ పురుషుడ,ని తన గురువు కోరిన వెంటనే బొటన వేలిని త్యాగం చేసిన ఆదిపురుషుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతమ్మ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లి గ్రామంలో ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గేదెల సత్తిబాబు అధ్యక్షతన ఏకలవ్యుని జయంతి ఉత్సవాలను ఆదివారం పండగలా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు రొంగళి చిన్న రామ మాట్లాడుతూ ఎరుకలపేటలో గల ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి జై ఏకలవ్య నినాదాలతో భారీ ఊరేగింపుగా, మందు గుండి సామాగ్రితో కాంగో డాన్సులతో పండగల వేడుక నిర్వహించా మన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చైర్మన్ గేదెల లక్ష్మణ్, ఎపి ఎరుకల సేవా సంఘం మహిళ కార్యదర్శి కుమారి దాసరి సత్యవతి, మహిళ ఉపాధ్యక్షురాలు దాసరి సంతోషి కుమారి, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి, యువజన అధ్యక్షుడు రమణ, జిల్లా కార్యదర్శి గేదెల అప్పారావు, మండల సంఘం అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, పోతనాపల్లి మాజీ సర్పంచ్ గేదెల పోతయ్య, దాసరి దేవుడు పాల్గొన్నారు.

పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని తిరుమల -మెడికవర్ హాస్పిటల్‌లో ఆదివారం పద్మశాలి గ్లోబల్ యాప్‌ను పద్మశాలి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.సంజీవ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీలను ఏకతాటిపైకి తేవడానికి ఈ యాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. పరస్పర సహకారంతో పద్మశాలీలు ముందుకు సాగాలని కోరారు. అనంతరం ఐటి సొల్యూషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ఒ వన్ సొల్యూషన్స్ ఎమ్‌డి జి.తిరుపతిరావు, పద్మశాలి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, తిరుమల హాస్పిటల్ ఎమ్‌డి కె.తిరుమల ప్రసాద్ మాట్లాడారు. ఈ ఏడాది 80 మందికి ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ సుపరిపాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వేపాడ

గడప గడపకూ సుపరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని పాటూరు గ్రామంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మండల నాయకులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరిలక్ష్మి, ఏఎంసి డైరెక్టర్ జనపురెడ్డి సన్యాసమ్మ, సన్యాసిరావు, అప్పలనాయుడు మాస్టర్, యూనిట్ ఇంచార్జ్ గోకేడ నాగభూషన్, మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు, బుద్ధ అప్పలనాయుడు, సేనాపతి దేముళ్ళు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, కోన సత్యం, జనపురెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని గరికిపేట గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్, టిడిపి గ్రామ అధ్యక్షులు చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షులు మహంతి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మహంతి రాజారావు, బెల్లాన ఈశ్వరరావు, నాగభూషణరావు, బంగారు నాయుడు, ఆదినారాయణ, శ్రీను, శంకరరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని ఆకులపేట, డెంకాడ, గుండాలపేట గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం మాజీ జడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, నాయకులు ప్రదీప్‌రాజు, సువ్వాడ రమేష్, పతివాడ సూరిబాబు, త్రిపురగిరి వెంకట్రావు, సువ్వాడ దుర్గరాజు, బుజ్జి, బుగత రమణ పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలోని ఐదో వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ఎన్నికల హామీలు అమలు, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ హైమవతి, నాయకులు, పాల్గొన్నారు.



నెల్లిమర్ల: గరికిపేటలో పథకాలు గురించి వివరిస్తున్న నాయకులు

వృద్ధులకు భోజనం వితరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వెలుగు ఆశ్రమం వృద్దులకు వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకులు దవల లక్ష్మణరావు భోజనం వితరణ అందజేశారు. ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) జన్మదిన వేడుకలు సందర్భంగా విజయనగరం బాబా మెట్ట వద్ద ఎటికె వెలుగు ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ డాక్టర్ సురేష్ బాబు ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు. ఆదినారాయణ, సోషల్ మీడియా కార్యకర్తలు చంద్రశేఖర్, ప్రసన్న, సాయి హర్ష తదితరులు పాల్గొన్నారు.